సాక్షి
తిరుపతి
శనివారం : 2 : నవంబర్ : 2024



పేదల పక్షాన నిలబడితే కేసులా?
పేదల పక్షాన నిలబడిన వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఎమ్మెల్యే మేరిగ మండిపడ్డారు. - 8లో



ఆగమోక్తంగా ఆకాశదీపం
కార్తీక మాసం సందర్భంగా ముక్కంటి ఆలయంలో శుక్రవారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. - 8లో



ఆర్టీసీలో ప్రత్యేక టూర్ ప్యాకేజీ
కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ ప్రకటించింది. - 8లో

న్యూస్‌రీల్

చెయ్యి ఎత్తితే 'స్టాపింగ్'

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ : తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో నడుస్తున్న మెట్రో ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి అక్టోబర్ 28వ తేదీన ఆగదే'మెట్రో' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు స్టాపింగ్ ఉన్న ప్రాంతాల్లో ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోటంతా మెట్రో సర్వీస్‌ను ఆపేల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. అలాగే తిరుపతి బస్టాండ్ వద్ద మెట్రో సర్వీసుల్లో టిక్కెట్ కొట్టి కండక్టర్ దిగి వెళ్లకుండా అంబేడ్కర్ సర్కిల్ వరకు బస్సులో వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తిలో సైతం పొన్నాలమ్మ గుడి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఏపీ సీడ్స్ సర్కిల్, పానగల్ కూడలి, రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు కాలనీ వరకు తప్పని సరిగా స్టాపింగ్ ఉండాలని ఆదేశించినట్లు తిరుపతి డీఎం బాలాజీ శుక్రవారం వెల్లడించారు. సీట్లు లేవు అంటూ బస్సును ఆపకుండా వెళితే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.

ఘనంగా 'రన్ ఫర్ యూనిటీ'



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఘనంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 31వ తేదీని జాతీయ ఏక్తా దినోత్సవంగా జరుకుంటున్నట్లు వెల్లడించారు. ఎస్పీ కార్యాలయం నుంచి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వరకు సాగిన ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

రేపు తిరుపతికి పార్లమెంటరీ కమిటీ



మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్ : పార్లమెంట్ కమిటీ ఆదివారం తిరుపతికి రానున్నట్లు డీఆర్‌ఓ నరసింహులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ రైల్వే శాఖపై ఆన్ ది స్పాట్ స్టడీ టూర్ నిమిత్తం రెండు రోజుల పర్యటనకు వస్తున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సాయంత్రం 4.40 గంటలకు కమిటీ రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకుని రాత్రి తిరుపతి తాజ్ హోటల్ బస చేయనుందని వెల్లడించారు. 4వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వేస్ జీఎంతో తాజ్ హోటల్‌లో సమావేశమవుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులపై ఆన్ ది స్పాట్ విజిట్ చేయనున్నట్లు తెలిపారు. రాత్రి 7.45 గంలకు పార్లమెంట్ కమిటీ రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమవుతుందని వివరించారు. సమావేశంలో ఆర్డీఓ రామ్మోహన్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, ప్రోటోకాల్ తహసీల్దార్ కుప్పయ్య పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖర్

వరదయ్యపాళెం : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం వరదయ్యపాళెం మండలం అంబూరులో బీడు భూముల ఆక్రమణను ఆయన సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. స్థానికులు కొందరు వరి నాట్లు వేయబోతుండగా అడ్డుకుని పంపేశారు. మరోసారి కబ్జాకు యత్నిస్తే కేసులు తప్పవని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

మళ్లీ ఏడిపించేన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒకటో తేదీ వేకువనే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందించేవారు. అవ్వాతాతలు ఎలాంటి ఇబ్బంది పడకుండా నగదు పంపిణీ చేసేవారు. అయితే కూటమి సర్కార్ వచ్చిన తర్వాత పండుటాకులు పెన్షన్ కోసం ఇక్కట్లు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉద్యోగులు రమ్మని హుకుం జారీ చేసిన చోటుకు వెళ్లేందుకు వృద్ధులు.. దివ్యాంగులు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో సర్వర్ మొరాయిస్తే ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. ఘనత వహించిన చంద్రబాబు మళ్లీ ఏడిపిస్తున్నారు అనుకుంటూ నిరాశగా ఇంటికి చేరుతున్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో చాలా చోట్ల ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేశాయి.



ఆర్‌సీపురం మండలం రామాపురంలో పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

- లబ్ధిదారులకు తప్పని పెన్షన్ తిప్పలు
- పలు చోట్ల సచివాలయల వద్దే పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి నగదు అందించని ఉద్యోగులు
- సర్వర్ మొరాయించడంతో అవ్వాతాతల పడిగాపులు

తిరుపతి అర్బన్ : గత ఐదేళ్లుగా తెల్లవారుజామునే వలంటీర్లు ఇంటి తలుపుకొట్టి సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లకు రాజకీయరంగు పులిమి తొలగించారు. ఆ తర్వాత నుంచి పింఛన్ల పంపిణీలో తిప్పులు తప్పడం లేదు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సర్వర్ సమస్యలు తలెత్తాయి. కొన్ని చోట్ల ఉదయం 8.30 నుంచి 10.30 వరకు .మరి కొన్ని చోట్ల ఉదయం 8.30 నుంచి 11.30 వరకు సర్వర్ పనిచేయలేదు. సచివాలయాల వద్దకు పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు పడిగాపులు కాయలేక నానా తంటాలు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఒక వీధిలో ఒకచోటే ఉండి అందర్నీ అక్కడికి పిలిపించే ఇచ్చే క్రమంలో వృద్ధులకు అగచాట్లు తప్పలేదు. కొన్నిచోట్ల టీడీపీ నేతలు తమ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వాలని ఉద్యోగులను డిమాండ్ చేశారు. అలా చేస్తే తమకు ఇబ్బందులు ఉంటాయని ఉద్యోగులు వెళ్లకపోవడంతో వాగ్వాదాలు తప్పలేదు. మరోవైపు ఇటీవల ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో పలువురు సచివాలయ సిబ్బంది పెన్షనర్ల ఇళ్లకు వెళ్లేందుకు దారి తెలియక ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలోనే ఒకే చోట ఇచ్చామని కొందరు ఉద్యోగులు చెప్పుకొచ్చారు. అయితే రాత్రి 7గంటలకు జిల్లా వ్యాప్తంగా 96.31శాతం మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారులు ప్రకటించారు.

అటెండర్‌కు పెన్షన్ బాధ్యత!

వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న అనితకు చిన్నపాండూరు సచివాలయ పరిధిలోని యానాదివెట్టు, రాచర్ల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎవరికి పెన్షన్ ఇవ్వాలో.. ఎక్కడ పంపిణీ చేయాలో తెలియని పరిస్థితి తలెత్తింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ బాధ్యతగా వచ్చి పింఛన్ ఇచ్చేవారని, చంద్రబాబు పాలనలో అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

3,674 మంది తొలగింపు

కూటమి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల్లో 3674 మంది పెన్షన్‌లను తొలగించారు. అయితే వారంతా మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నాలుగు నెలల్లో అంత మంది మరణించారా అనే అంశంపై సర్వత్రా చర్చసాగుతోంది. మృతుల వివరాలను మాత్రం అధికారులు గోప్యంగా ఉంచుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలగించిన పెన్షనర్ల జాబితా విజయవాడలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉందని అధికారులు చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆర్‌సీపురం మండలం తనపల్లెలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

సర్వర్ సమస్య తలెత్తింది

ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో శుక్రవారం రెండు గంటల పాటు సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో పెన్షన్ల బట్వాడాలో కాస్త జాప్యం జరిగింది. తర్వాత శరవేగంగా పింఛన్లు అందించాం. రాత్రి 7 గంటలకు 96.31శాతం మందికి నగదు పంపిణీ చేశాం.

– శోభన్‌బాబు, పీడీ, డీఆర్‌డీఏ

రేపే భూమన పదవీ ప్రమాణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ
- పెద్దసంఖ్యలో తరలిరానున్న జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి నేతలు
- భారీ ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు



తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం పదవీ ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు భారీగా తరలిరానున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. వైఎస్సార్‌సీపీలో మంచి వాగ్ధాటి కలిగిన నేతగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన భూమనకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమించారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకే భూమనకు పదవి కట్టబెట్టినట్లు నేతలు వెల్లడించారు.

భారీ సంఖ్యలో నాయకుల రాక

ఈ నెల 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి పార్టీకి చెందిన జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు తరలిరానున్నారు. అందులో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్నారు.

కూటమిపై పోరుకు సిద్ధం

కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం చేస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేయడంతోపాటు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భూమన పోరాడనున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు కేవలం వంద రోజుల్లోనే ప్రభుత్వ భూముల ఆక్రమణ, సివిల్ సెటిల్‌మెంట్లు, అక్రమంగా మైనింగ్, ఇసుక స్మగ్లింగ్ మట్టిని సైతం మింగేస్తుండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేతను మూటగట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మంచి జరిగిందని, కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే అరాచకాలు మొదలయ్యాయని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇలాంటి తరుణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేయడంతో పాటు.. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు భూమన నాయకత్వంలో ముందుకు సాగేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

ఏర్పాట్లు పరిశీలించిన చెవిరెడ్డి

వేలాది మంది నాయకులు, కార్యకర్తల నడుమ భూమన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరా తీశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి అనుకుని నయారా పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మైదానంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీ గురుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



ఏర్పాట్లపై నేతలతో చర్చిస్తున్న చెవిరెడ్డి

శాస్త్రోక్తం.. కేదారగౌరీ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా కేదారగౌరీ వ్రతం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కలశ స్థాపన చేసి వ్రతం ఆచరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి సాంగ్యం సమర్పించి నోములు నోచుకున్నారు. నోము దారాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

'వసతి'లో విద్యార్థుల అవస్థలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని లోతువాతువాని గుంట కాలనీలో ఉన్న ప్రభుత్వ ఎస్టీ పోస్టు మెట్రిక్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సక్రమంగా భోజనం కూడా అందకపోవడంతో అలమటిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు కూడా అల్పాహారం వడ్డించకపోవడంతో ఆకలితో అల్లాడిపోయారు. ఈ హాస్టల్‌లో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా పిల్లలకు నాణ్యమైన భోజనం అందడం లేదు. దీంతో కొందరు బయట హోటళ్లలో ఆకలి తీర్చుకుంటున్నారు. జేబులో డబ్బులేని వారు కడుపు మాడ్చుకుంటున్నారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం మెనూ ప్రకారం పొంగల్ వడ్డించాలి. అయితే కాలేజీ టైమ్ అయిపోతున్నా టిఫిన్ రాలేదు. వంటమనిషిని అడిగితే గ్యాస్ అయిపోయిందని, తీసుకువచ్చి పొంగల్ చేసేసరికి ఆలస్యమైందని చెప్పుకొచ్చింది. వార్డెన్ మాత్రం హాస్టల్‌లో కనిపించలేదు. ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో కూడా విద్యార్థులకు తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో నాణ్యమైన భోజనం, ఇతర వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నాయుడుపేటలోని ఎస్టీ విద్యార్థుల హాస్టల్

నిరాశాజనకంగా నిమ్మ!

వాతావరణం అనుకూలించక నిమ్మ సాగు నిరాశాజనకంగా మారింది. ఓ వైపు మండే ఎండ.. మరోవైపు పొగమంచు కారణంగా పూత రాని పరిస్థితి తలెత్తింది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏడాదిలో మూడు పర్యాయాలు రావాల్సిన పూత.. ఒక్క సీజన్‌లో కూడా సక్రమంగా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈసారి నష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు.



ఎండుతున్న నిమ్మ చెట్లు

- అనుకూలించని వాతావరణం
- ఇప్పటికీ పూతకు రాని చెట్లు
- ఆందోళనలలో రైతులు
- దిగుబడిపై ఆందోళన



పూత పట్టని నిమ్మ చెట్లు

డక్కిలి : జిల్లా లోని వెంకటగిరి,బాలాయపల్లె, డక్కిలి, గూడూరు, ఓజిలి, చిల్లకూరు, నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, వాకాడు, కోట ,చిట్టమూరు, పెళ్లకూరు, శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో అధికంగా రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. ఈఏడాది ప్రతి కూల పరిస్థితుల కారణంగా నిమ్మ పంట అరకొరగా ఉంది. వాస్తవానికి జూన్‌లో తొలకరి వర్షాలతోనే నిమ్మ చెట్లకు పూత పూయాలి. తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా పూత రావాలి.అయితే ఈ రెండు సీజన్‌లలో నిమ్మ చెట్లు అరకొరగానే పూత వేశాయి. అది కూడా వాతావరణం అనుకూలించక రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు చెరువులు, బావులు, వాగుల్లో నీరు అడుగంటిపోవడంతో నీటి తడులు పెట్టలేక పోయారు. అలాగే పొగమంచు కమ్ముకోవడం వల్ల పూత రాలి పోయినట్లు రైతులు చెబుతున్నారు. ఇక మూడో సీజన్ నవంబర్ లేదా డిసెంబర్‌లో నిమ్మచెట్లకు పూత రావాలి. దీని పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పెట్టుబడి అధికం

నిమ్మ సాగులో రైతులకు అధికంగా సాగు ఖర్చులు ఉంటాయి. వేసవిలో నిమ్మ చెట్లకు ఎకరాకు దున్నకం, తవ్వకం, ఎరువులు, క్రిమి సంహారక మందులు అన్ని కలిపి రూ, 50వేల వరకు ఖర్చు అవుతోంది. అయితే రైతులు అందరు ఇప్పటికే నిమ్మ చెట్ల పనులు పూర్తి చేశారు. పూత పూయక పోవడం వల్ల సాగు ఖర్చులు అయిన వస్తాయా..అనే ఆందోళన రైతులు నుంచి వ్యక్తం అవుతోంది. అక్టోబర్ చివరి వారంలో చినుకు కూడా రాలకపోవడంతో నిమ్మకు పూత రాలేదని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి కూడా రాదు



నేను 400 నిమ్మ చెట్లు సాగు చేస్తున్నా. ఇప్పటికే సేద్యం ఖర్చులు అధికంగా ఉన్నాయి. అయితే ఇటీవల అరకొరగా నిమ్మ పూత పూసింది. ఈనెలలో పూత పూస్తే ధరలు పలికి ఆదాయం ఉంటుంది. లేక పోతే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– జి.అరుణాచలం, పాతనాలపాడు

ఎండిపోతున్నాయి



నేను 100 నిమ్మ చెట్లు సాగు చేస్తున్నా. ప్రస్తుతం నిమ్మ చెట్లకు వేరుకుళ్లు తెగులు ఆశించి ఎండి పోతున్నాయి. ఇప్పటి వరకు నిమ్మ చెట్లు పూత పూయలేదు. ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా సక్రమంగా వస్తుందో రాదో అర్థం కావడం లేదు.

– డి.మురళీరెడ్డి, డక్కిలి

వాతావరణమే కారణం



ఈఏడాది వాతావరణ పరిస్థితులు నిమ్మ పూతకు ప్రతిబంధకంగా మారాయి.ఈ సీజన్‌లో 28 నుంచి 30 డిగ్రీలు వరకు ఉష్ణోగ్రత ఉండాలి.అయితే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో నిమ్మ చెట్లకు పూత రావడం లేదు. క్రిమి సంహకరక మందులు అధికంగా వాడడం వల్ల కూడా నిమ్మ పూత తగ్గింది.

– ఆనందరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, వెంకటగిరి

క్లుప్తంగా

వైట్ కార్డు ఉంటేనే ఉచిత గ్యాస్

తడ : తెల్ల రేషన్ కార్డు, ఆధార్ ఉన్న వారు మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. దీపం–2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీకి శుక్రవారం తడ మండలం, రామాపురంలో శ్రీకారం చుట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,00,307 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఇందులో వైట్ కార్డు, ఆధార్ ఉన్నవారికి ఏడాదిలో ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున మొత్తం మూడు సిలిండర్లు అందిస్తామని వివరించారు. నగదు చెల్లించి సిలిండర్ పొందిన 48 గంటల్లో డబ్బులు మళ్లీ లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయని తెలిపారు. అలాగే సాగరమాల పథకం కింద పూడి రాయదొరువు వద్ద పులికాట్ ముఖ ద్వారం పూడికతీత పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ, ఆర్డీఓ కిరణ్మయి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు.

గడ్డివాము దగ్ధం



బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పద్మావతిపురంలో బాణసంచా పేలుస్తుండగా రవ్వలు ఎగసిపడి గురువారం రమణయ్య అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. సుమారు 300 గడ్డిమోపులు పూర్తిగా కాలిపోయాయి. శ్రీకాళహస్తి అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాప్తి చెందకుడా అదుపు చేశారు.

దూసుకెళ్లిన కోడెగిత్తలు

- పలకల కోసం యువకుల పోటీ
- జగనన్న నినాదంతో హోరెత్తిన కోణంగిపల్లె

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కోణంగిపల్లెలో గురువారం నిర్వహించిన ఎద్ల పందేలు (జల్లికట్టు) యువతలో జోష్ తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో చేపట్టిన ఎద్ల పందేలు దుమ్మురేపాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వీధులు కిక్కిరిశాయి. యువకులు కోడెగిత్తల వెంట పరుగులు తీస్తూ జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. నిర్వాహకులు ముందుగా ఎద్లకు పలకలు, వస్త్రాల తో పాటు బెలూన్‌లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటా లతో కూడిన పలకలను ప్రత్యేకంగా తయారు చేయించడం ఆకట్టుకుంది. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకు న్న యువత పలకలు సాధించేందుకు సిద్ధమయ్యా రు. నిర్వాహకులు ఎద్లను ఉసిగొల్పి వదిలడంతో వాటిని నిలువరించి ఎలాగైనా పలకలు పట్టాలన్న ఆత్రుతతో యువకులు పోటీ పడ్డారు. కొందరు పలకలు సాధించి విజయ దరహాసంతో చిందులు వేశారు. కొన్ని ఎద్లు యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి.



జోరుగా సాగుతున్న ఎద్ల పందెం



పలకలు చేజిక్కించుకునేందుకు పోటీ పడుతున్న యువకులు



పరుగులు తీస్తున్న ఎద్లను నివారించేందుకు యత్నిస్తున్న యువత

పేదల పక్షాన నిలబడితే కేసులా?

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట : పేదల పక్షాన నిలబడిన వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆరోపించారు. గురువారం కోట పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్‌ను ఆయన పరామర్శించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఏపీఓ పూర్ణిమ పనితీరుపై అనేక విమర్శలు వస్తున్నాయన్నారు. కొత్తపట్నంలో పని చేసిన కూలీలకు డబ్బులు చెల్లించలేదని మండిపడ్డారు. మస్టర్‌లో పేర్లు తొలగించి కూలీలను ఇబ్బందులు పెడుతుండడంతో ప్రశ్నించిన ప్రసాద్ గౌడ్‌పై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రంతా ఆయనను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారన్నారు. దీంతో ఆయన అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఏపీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కొత్తపట్నం సెజ్‌లో పరిశ్రమలు రానున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలను అణచివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ప్రభాకర్, వెంకటాద్రి పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



పురస్కారం అందుకుంటున్న మోహన్‌కృష్ణ



బహుమతి పొందిన ఫొటో (ఫైల్)

తిరుపతి సిటీ: ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కాంటెస్ట్‌లో తిరుపతికి చెందిన సాక్షి ఫొటోగ్రాఫర్ కేతారి మోహన్‌కృష్ణకు రెండో బహుమతి లభించింది. ప్రకృతి విపత్తుల విభాగంలో మోహన్‌కృష్ణ తీసిన ఫొటోకు ఈ అవార్డు దక్కింది. శుక్రవారం ఈ మేరకు విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మధరావు చేతుల మీదుగా అవార్డు, నగదు బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సుందర్ కొంపల్లి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, క్యాన్సర్ వైద్య నిపుణుడు ఎస్.సుబ్బారావు, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్ చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపం వెలిగించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలోని ఊంజల్ సేవ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న ఈఓ

ఆర్టీసీలో ప్రత్యేక టూర్ ప్యాకేజీ



అల్ట్రా డీలక్స్ బస్సు

తిరుపతి అర్బన్ : కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ తిరుపతి డిపో వారు ప్రత్యేకంగా సరికొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసులతో ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనకు ఒక రోజు యాత్ర కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీ తీసుకువచ్చినట్లు డీఎం బాలాజీ తెలిపారు. సోమవారం నుంచి ఈ ప్యాకేజీ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ప్రత్యేక బస్సు తిరుపతి నుంచి బయలుదేరి శ్రీనివాసమంగాపురం, తొండవాడ, అప్పలాయిగుంట, నారాయణవరం, కైలాసనాథకోన, నాగలాపురం, సురుటుపల్లె క్షేత్రాలకు భక్తులను తీసుకెళుతుందని వివరించారు. ఇందుకోసం పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.280 టికెట్ రేటుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో సైతం టికెట్ బుక్ చేసుకోవచ్చని సూచించారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్ : దేశ సమగ్రత, సమైక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు చిరస్మరణీయమని డీఆర్‌ఓ నరసింహులు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశంలోని సంస్థానాల ఐక్యతకు పాటుపడిన మహనీయుడని తెలిపారు. అందుకే పటేల్ జయంతిని 'జాతీయ ఏక్తా దివస్'గా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ భారతి పాల్గొన్నారు.

ఎక్కడైనా తవ్వేస్తాం.. అంతా మా ఇష్టం

- కైవల్యా నదిలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- అక్రమంగా టీడీపీ నేతల తవ్వకాలు

చిల్లకూరు : గూడూరు రూరల్ మండలం నెర్నూరు పంచాయతీలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. కైవల్యా నది పరీవాహక ప్రాంతంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేసి అమ్మేస్తున్నారు. నదిలో ఇసుక ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని భావించిన రైతుల ఆశలపై నీరు చల్లేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఎక్కడైనా తవ్వుకుంటాం.. అంతా మా ఇష్టం అంటూ హుంకరిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక దోపిడీని అడ్డుకోవాలని కోరుతున్నారు.



కైవల్యానదిలో జేసీబీతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

వివాహిత అదృశ్యం



పెంచలమ్మ, రాజా, సీసీ కెమెరాలో నమోదైన పెంచలమ్మ, రాజాతో మాస్క్ ధరించిన వ్యక్తి చిత్రం

వెంకటగిరి రూరల్ : దీపావళి పండుగకు భర్తతో కలసి పుట్టింటికి బయలుదేరిన వివాహిత మార్గం మధ్యలోనే శుక్రవారం అదృశ్యమైంది. వివరాలు.. మండలంలోని పారవోలు పంచాయతీ సీసీ కండ్రిగకు చెందిన వెంకటరామయ్య, కుమారి దంపతుల కుమారుడు రాజాకు అన్నమయ్య జిల్లా చిట్వేలి అగ్రహారానికి చెందిన పెంచలమ్మ(లక్ష్మి)తో 8 నెలల క్రితం వివాహమైంది. దీపావళి పండుగను పురస్కరించుకుని బుధవారం చిట్వేలికి వెళ్లేందుకు ఆ దంపతులు రాపూరులో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగారు. అక్కడ ముఖానికి మాస్క్ ధరించిన మరో వ్యక్తి వారికి తోడయ్యాడు. ముగ్గురు కలిసి బుధవారం రాత్రి వరకు ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం రాజంపేటలోని ఓ తోట వద్దకు వెళ్లి శుక్రవారం తెల్లవారుజాము వరకు అక్కడే ఉన్నట్లు సమాచారం. రాజా బహిర్భూమికి వెళ్లి వచ్చేలోగా అతని భార్య కనిపించకుండా పోయింది. దీంతో రాజా, మరోవ్యక్తి కలసి పెంచలమ్మ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరలేదు. దంపతులు చిట్వేలికి రాకపోవడంతోపాటు, వారి సెల్‌ఫోన్‌లో కూడా పనిచేయకపోవడంతో రాజా, పెంచలమ్మ ఇరువురి తల్లిదండ్రులు వెంకటగిరి, రాపూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజా తిరిగి రాపూరుకు రాగా వెంకటగిరి పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్యామ్‌బాబు



శ్యామ్‌బాబును అభినందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

తిరుపతి తుడా : తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటేషన్‌పై ఆర్థోపెడిక్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన తదుపరి ఆదేశాల వరకు మెడికల్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతారని రాష్ట్ర బీమా వైద్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌బాబుకు డాక్టర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. డాక్టర్ శ్యాంబాబు మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకురాలి అరెస్ట్

తిరుపతి రూరల్ : మండలంలోని కుంట్రపాకంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పార్వతి అనే మహిళలను ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి 12 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపారు. ఆమెకు ఏ దుకాణంలో మద్యం విక్రయించారు, దీని వెనుక ఎవరు ఉన్నారు అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. దాడిలో ఎక్సైజ్ రూరల్ ఎస్ఐ కవీశ్వర్‌నాయుడు, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.

భీమవరం వైపు.. ఏనుగుల గుంపు



పాళెం కొండల వద్ద ఏనుగులు గుంపు

భాకరాపేట : చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం నుంచి ఏనుగుల గుంపు శుక్రవారం వేకువజామున జిల్లాలోని జంగావాండ్లపల్లె పంచాయతీలోకి ప్రవేశించింది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు జంగావాండ్లపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె, నెల్లుట్లవారిపల్లె పంచాయతీలోని ప్రజలను అప్రమత్తం చేశారు. భాకరాపేట అటవీ క్షేత్రాధికారి వెంకటమణ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించి రెడ్డిమానువంక, కానుగలవంక, చింతలవంక, గుట్లకాడనగిరి మీదుగా భీమవరం అడవి వైపు ఏనుగులను దారి మళ్లించారు. గుంపులో 4 గున్న ఏనుగులు, 4 మగ ఏనుగులు, 9 ఆడ ఏనుగులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలో రైతును తొక్కేసిన ఘటనలో 20 ఏనుగులు గుంపు ఉంది. ఆ గుంపే ఇటు వైపు వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే పాళెం కొండల సమీపంలో 17 ఏనుగులు మాత్రమే కనిపించినట్లు చెబుతున్నారు. దీంతో మిగిలిన మూడు ఏనుగులు కూడా ఈ మార్గంలోనే వచ్చే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే రెడ్డిమానువంక సమీపంలోని బీవీ రెడ్డి మామిడి తోట వద్ద శుక్రవారం సాయంత్రం మూడు ఏనుగులు ఉన్నట్లు స్థానిక రైతులు వెల్లడిస్తున్నారు.

కత్తితో దాడి: ఇద్దరికి గాయాలు



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసు

నాయుడుపేటటౌన్ : మండలంలోని పుదూరులో శుక్రవారం సాయంత్రం చందు అనే వ్యక్తి కత్తితో దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన చైతన్య గురువారం రాత్రి నలజాం చందుతో గొడవ జరిగింది. దీంతో చందు క్షక్షపెంచుకుని భాస్కర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి చైతన్యపై దాడి చేశాడు. కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. అడ్డువచ్చన చైతన్య అవ్వ పోలమ్మను కూడా కత్తితో నరికి పరారయ్యాడు. బాధితులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



పిచ్చయ్య నాయుడు (ఫైల్)

దక్కిలి : మండలంలోని దగ్గవోలులో శుక్రవారం చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయి ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఎద్దల పిచ్చయ్య నాయుడు తన తోట సమీపంలో ఉన్న చెరువు దగ్గరకి వెళ్లగా ప్రమాదం జరిగింది. గ్రామస్తులు చెరువులో దిగి మృతదేహాన్ని వెలికితీశారు.

'కోన'లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాపూరు : మండలంలోని పెంచలకోన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనారోగ్యం కారణంగా గుర్తుతెలియని వ్యక్తి (55)మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ వ్యక్తి వంట మాస్టర్‌గా పెంచలకోన, గోనుపల్లెలో పనిచేసేవాడని, అతడి పేరు ఎవరికీ తెలియదని వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లె సమీపంలో నెల్లబల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కొప్పుల శివకుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శస్త్ర చికిత్సకు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్న హస్తం కోసం బాధిత కుటుంబం ఎదురు చూస్తోంది.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

తిరుపతి క్రైమ్ : తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్టోబర్‌లో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. సత్యసాయి జిల్లాకు చెందిన ఓ కుటుంబం తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అదే జిల్లాకు చెందిన ఓకే శివకుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికపై లైంగికదాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ : బీఎస్ కండ్రిగకు చెందిన శివకుమార్, హేమంత్‌కుమార్ ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి నుంచి వస్తుండగా విజయగోపాలపురం వద్ద లారీ ఢీకొంది. దీంతో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కాటూరు గ్రామానికి చెందిన ధనుష్ ద్విచక్రవాహనంలో శ్రీకాళహస్తి నుంచి కంటైనరు ఢీకొని గాయాలపాలయ్యాడు. ఎపీకండ్రిగకు చెందిన నారాయణ ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళుతుండగా అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

క్రీడా ప్రాంగణాలను కమర్షియల్ చేయొద్దు

తిరుపతి సిటీ : ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన క్రీడా ప్రాంగణాలను కమర్షియల్ కార్యాక్రమాలకు ఇవ్వకుండా జీఓ తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు శాప్ చైర్మన్ రవినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూ అధికారులు ఎన్టీఆర్ స్టేడియంలో కమర్షియల్ ప్రోగ్రామ్ కోసం ప్రైవేటు వ్యక్తులకు అనుమతిచ్చారన్నారు. వారు విద్యార్థులను లాఠీలతో కొట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాభివృదికే మైదానాలు ఉపయోగించాలని కోరారు.